

ఏసీబీ నజర్!

ఉమ్మడి జిల్లాపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి సారించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే రంగంలోకి దిగుతున్నారు.

- 8లో ▸



నిరుపయోగంగా రైతు వేదికలు

జిల్లాలో రైతువేదికలు నిరుపయోగంగా మారాయి. నిర్వహణకు నిధులు లేక దుమ్ము పట్టిపోతున్నాయి.

- 9లో ▸



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



కామారెడ్డి క్రైం: జిల్లా జడ్జి వరప్రసాద్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్జికి మొక్కను బహూకరించారు.

మంత్రి పీఎస్‌గా అదనపు కలెక్టర్‌కు డిప్యుటేషన్



సాక్షి, కామారెడ్డి: రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పీఎస్‌గా డిప్యుటేషన్‌పై వెళ్లారు. చంద్రమోహన్ 2022 జనవరి 21న కామారెడ్డి రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా వచ్చారు. దాదాపు రెండున్నరేళ్లు ఇక్కడ పనిచేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికే రెవెన్యూ అదనపు కలెక్టర్ బాధ్యతలను అప్పగించారు.

'2, 5 తేదీల్లో సీల్డ్ టెండర్లు తెరుస్తాం'

కామారెడ్డి క్రైం: జిల్లాలోని 9 మైనారిటీ గురుకులాల్లో ఆహార దినుసులు, పండ్లు, కూరగాయల సరఫరా కోసం వచ్చిన టెండర్లను వచ్చేనెల 2, 5 తేదీలలో తెరవనున్నారు. ఈ విషయాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో తేదీన కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్‌కు సంబంధించిన సీల్డ్ టెండర్లను, ఐదో తేదీన ఆహార దినుసులకు సంబంధించిన టెండర్లను తెరుస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని టెండరుదారులు గమనించాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-3 ఖాళీలు, ఫిజిక్స్, ఫిషరీస్, ఫారెస్ట్రీ, స్టాటిస్టిక్స్ సబ్జెక్టలలో ఒక్కో ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైనవారు 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 3వ తేదీన ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంపిక ప్రక్రియ కళాశాల విద్యా కమిషనర్ నిబంధనల ప్రకారం జరుగుతుందని, నెట్, పీహెచ్‌డీ, సెట్, బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

'పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి'



మద్నూర్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆయన తడి హిప్పర్గా, సోనాల, మద్నూర్‌లలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టిన మరమ్మతులు, మౌలిక వసతుల పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సుల్తాన్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మురళి పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకటనర్సయ్య, కార్యదర్శి సందీప్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్సెస్సీ సప్లిమెంటరీలో 81.30 శాతం ఉత్తీర్ణత

కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. పరీక్ష రాసినవారిలో 81.30 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 845 మంది పరీక్ష రాయగా 687 మంది విద్యార్థులు పాసయ్యారు. 514 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా 402 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 78.21 గా నమోదయ్యింది. బాలికలలో 331 మంది పరీక్షలు రాయగా 285 మంది పాసయ్యారు. 86.10 శాతం ఉత్తీర్ణత సాధించారు.

అందరి చూపు హస్తిన వైపు!

- ఎవరిని ఏ పదవి వరించేనో?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- పీసీసీ చీఫ్ రేసులో షబ్బీర్, షెట్కార్
- మంత్రి పదవులతోపాటు నామినేటెడ్ పోస్టుల కోసం పలువురి ప్రయత్నాలు

అందరి చూపు ఢిల్లీపై కేంద్రీకృతమైంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల రాష్ట్ర అధ్యక్షుల ఎంపిక కోసం కసరత్తు నడుస్తుండడంతో ఆయా పార్టీల అధ్యక్షులు ఎవరవుతారన్న అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అలాగే రాష్ట్రంలో మంత్రి పదవులు ఆశిస్తున్న నేతలు కూడా ప్రయత్నాలు చేస్తుండడంతో ఆయా అంశాలపై జోరుగా చర్చలు నడుస్తున్నాయి.



సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్, బీజేపీలు తమ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుల నియామకంపై దృష్టి సారించాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మంత్రి పదవులతోపాటు నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తుందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆశిస్తున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లను ఓడించి జెయింట్ కిల్లర్‌గా అవతరించిన వెంకటరమణారెడ్డి శాసనసభలో బీజేపీ ఉప నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేయడానికి ఆసక్తి చూపుతున్న ఆయన ఐదారు రోజులుగా ఢిల్లీలో మకాం వేశారు. ఈ నేపథ్యంలో తమ నాయకుడికి రాష్ట్ర అధ్యక్ష పదవి వస్తుందనే ధీమాతో ఆయన అనుచరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురు ఆశావహులు..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవితో పాటు రాష్ట్ర మంత్రి వర్గంలో అవకాశం కోసం జిల్లాకు చెందిన నేతలు ప్రయత్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడైన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మైనారిటీ కోటాలో పీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. ఆయన మొదట ఎమ్మెల్సీ అవకాశంతోపాటు మంత్రి పదవి ఆశించారు. అయితే ప్రభుత్వ సలహాదారుతో సరిపెట్టారు. ప్రస్తుతం పీసీసీ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ సైతం బీసీ కోటాలో పీసీసీ చీఫ్ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంత్రి పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. పార్టీ అగ్రనేతలతో ఉన్న సన్నిహిత సంబంధాలతో తనకు మంత్రి వర్గంలో అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ కోటాలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కీలక పదవి దక్కే అవకాశాలున్నాయి. వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసి దానికి చైర్మన్‌గా నియమిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

నామినేటెడ్ పదవులకోసం..

కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు నామినేటెడ్ పదవులకోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన డజనుకుపైగా నేతలు రాష్ట్ర స్థాయి పదవులను ఆశిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావుతోపాటు సీనియర్ నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, దేవరాజ్ గౌడ్, చంద్రకాంత్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. మరో యాభై మంది వరకు గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్, సీడీసీ చైర్మన్, డైరెక్టర్ వంటి పదవుల కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. జిల్లాకు చెందిన ముఖ్య నేతల వద్దకు వెళ్లి తమకు అవకాశం ఇప్పించాలని కోరుతున్నారు. పీసీసీ అధ్యక్ష పదవితో పాటు మంత్రి పదవులపై స్పష్టత వచ్చాక నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ మొదలవవచ్చని తెలుస్తోంది.

ఇందిరమ్మకేదీ గౌరవం!



జిల్లాకేంద్రంలో నిరాదరణకు గురవుతున్న ఇందిరా చౌక్

ఇందిరమ్మ పాలన అందిస్తామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ నేతలు.. జిల్లాకేంద్రంలోని ఇందిరా చౌక్‌ను మాత్రం పట్టించుకోవడం లేదు. చౌక్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం చుట్టూ గతంలో ఏర్పాటు చేసిన రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది. గతంలో గద్దె చుట్టూ పచ్చటి గడ్డి ఉండేది. పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం కనిపించేది. ఇప్పుడు ఆ ఆనవాళ్లే లేవు. ఇందిరమ్మ పాలనలో ప్రజల కష్టాల సంగతి ఏమోగానీ కనీసం ఇందిరా చౌక్‌ను జంక్షన్‌గా అభివృద్ధి చేయాలన్న ఆలోచన కూడా కాంగ్రెస్ పాలకులు చేయకపోవడంపై పట్టణవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

– సాక్షి, కామారెడ్డి

జిల్లా నేతలతో కేసీఆర్ సమావేశం



కేసీఆర్‌తో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, సురేందర్, గోవర్ధన్, హన్మంత్ సింధే

సాక్షి, కామారెడ్డి: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం మెదక్ జిల్లా ఎర్రవల్లిలోని తన ఫాంహౌజ్‌లో జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. జిల్లాలో రాజకీయ పరిస్థితిపై చర్చించారు. ఇటీవల బాన్సువాడ శాసనసభ్యుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీ పరిస్థితులపై ఆయన కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధేలతో సమీక్షించారు. పార్టీ శ్రేణులకు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల డబ్బుల పంపిణీలో గందరగోళం

- మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యంగా వ్యవహారం
- పనిచేయని వారికి కూడా డబ్బులు ఇవ్వడంపై విమర్శలు



నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన మున్సిపల్ అధికారులు, ఉద్యోగులకు ఎన్నికల జీతభత్యాల పంపిణీలో గందరగోళం ఏర్పడింది. విధులు నిర్వహించింది కొందరైతే.. పనిచేయని వారికి కూడా డబ్బులు పంపిణీ చేయడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కమిషనర్ ఆదేశాల మేరకు పగలు, రాత్రి తేడా లేకుండా విధులు నిర్వహించిన తమకు డబ్బుల పంపిణీలో అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తతంగం అంతా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎదురుగా ఉన్న మేనేజర్ చాంబర్‌లో జరగడం గమనార్హం.

రూ. 56 లక్షలు వచ్చినా..

వాస్తవానికి ఎన్నికల్లో సుమారు 200 మంది వరకు మాత్రమే విధులు నిర్వహించినా.. కమిషనర్‌కు దగ్గరగా ఉండే అధికారులు వందల సంఖ్యలో ఉద్యోగుల డబ్బులు పంపిణీ చేయడంతో.. అన్యాయానికి గురైన ఉద్యోగులు ప్రశ్నించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన వారికి రూ. 56 లక్షలకుపైగా జీతభత్యాలు వచ్చాయి. అయితే వీటిని విధులు నిర్వహించిన వారికి మాత్రమే ఇవ్వాల్సి ఉండగా.. ఇష్టారాజ్యంగా పంపిణీ చేయడంతో ఉద్యోగులు డబ్బులు తీసుకోకుండా అసహనంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై కమిషనర్‌ను కలిసి విన్నవిస్తామని పేర్కొన్నట్లు సమాచారం.

ఉద్యోగులు వెనక్కి వెళ్లిపోయారు

డబ్బుల పంపిణీ విషయంలో కొంత మంది ఉద్యోగులు తమ అన్యాయం జరుగుతోందని వెనుతిరిగి వెళ్లిపోయిన విషయం వాస్తవమే. అయితే సౌత్ ఎమ్మార్వో ఇచ్చిన జాబితా ప్రకారమే డబ్బులు పంపిణీ చేశాం. ఇంతకు మించి నాకు ఏమి తెలియదు.

– సునీల్ కుమార్, మున్సిపల్ మేనేజర్

410 పింఛన్ల నిలిపివేత

- ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి సభ్యులుగా గుర్తింపు
- రూ. 2.68 కోట్ల రికవరీకి చర్యలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు ఆసరా పొందుతున్న వారి గుట్టు రట్టయ్యింది. సాంకేతిక పరిజ్ఞానంతో అలాంటి వారిని గుర్తించిన ప్రభుత్వం జిల్లాలో 410 మందికి పింఛన్లను నిలిపివేసింది. పింఛన్ డబ్బులు డ్రా చేసుకోకుండా వారి బ్యాంకు, పోస్టాఫీసు అకౌంట్లను ఫ్రీజ్ చేసింది. ఇన్ని రోజుల పాటు పొందిన పింఛన్ డబ్బులను రికవరీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మండలాల వారీగా డేటాను తీశారు. నిబంధనలకు విరుద్ధంగా పింఛన్లు పొందిన వారి వివరాలతో ఎంపీడీవో ఆఫీసులకు లేఖలు రాశారు. వారి నుంచి డబ్బులను తిరిగి రాబట్టాలని లేఖల్లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 410 మందిని గుర్తించగా వీరి నుంచి రూ. 2.68 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది. త్వరలోనే ఎంపీడీవోలు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయనున్నారు.

'గృహజ్యోతి' అందని ద్రాక్షేనా?

రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించినా.. చాలా కుటుంబాలకు లబ్ధి చేకూరడం లేదు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో దొర్లిన పొరపాట్లతో జిల్లాలో సుమారు 75 వేల కుటుంబాలకు జీరో బిల్ రావడం లేదు. దీంతో వారంతా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

- జిల్లాలో 75 వేల కుటుంబాలకు చేకూరని లబ్ధి
- ఆన్‌లైన్ నమోదులో పొరపాట్లతో పథకానికి దూరం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు



కామారెడ్డి బల్దియా వద్ద ప్రజాపాలన దరఖాస్తులకోసం క్యూలో ఉన్న ప్రజలు (ఫైల్)

కామారెడ్డి టౌన్: అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ప్రతినెలా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామన్న ఆ హామీల్లో ఒకటి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హామీల అమలుకు ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో తొమ్మిది కేటగిరీలలో 4,22,497 విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటిలో గృహ విద్యుత్ కనెక్షన్‌లు 2,69,177 ఉన్నాయి. అయితే 2,30,328 కుటుంబాలు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. గృహజ్యోతికి సంబంధించి జిల్లాలో 2 లక్షల వరకు దరఖాస్తులు రాగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయితే 1.25 లక్షల కుటుంబాలకే గృహజ్యోతి అమలవుతున్నట్లు తెలుస్తోంది. ఇంకా 75 వేల కుటుంబాలకు పథకం వర్తించకపోవడంతో వారంతా కరెంటు బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. జీరో బిల్లు రాకపోవడంతో నిరాశకు గురైనవారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా అంతలోనే లోక్‌సభ ఎన్నికలు రావడం, ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో దరఖాస్తులు, సవరణల ప్రక్రియ నిలిచిపోయింది.

ఆప్షన్ లేక..

కొందరు అవగాహన లోపంతో దరఖాస్తు పత్రాలను సక్రమంగా పూరించలేదు. మరోవైపు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ఆపరేటర్లు తప్పులు చేసినట్లు తెలుస్తోంది. దీంతో చాలామంది గృహజ్యోతి లబ్ధిదారులు కాలేకపోయారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రజలు మళ్లీ గృహజ్యోతి పథకం దరఖాస్తు చేసుకోవడం, సవరణల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ప్రజాపాలన దరఖాస్తుల సవరణకు సంబంధించి ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దరఖాస్తుల సవరణకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

జీరో బిల్లు రావడం లేదు



నేను ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా. ప్రతి నెల 100 నుంచి 130 యూనిట్ల వరకే విద్యుత్‌ను వినియోగిస్తున్నాం. కానీ నాకు జీరో బిల్లు రావడం లేదు. మున్సిపల్, విద్యుత్‌శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ప్రయోజనం లేదు. సర్కారు స్పందించి అర్హులందరికీ జీరో బిల్లు వచ్చేలా చూడాలి.

– పునుగోటి సందీప్, కామారెడ్డి

ఉన్నతాధికారులకు నివేదించాం



జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో తప్పిదాలతో కొందరికి జీరో బిల్లు రావడం లేదు. గృహజ్యోతి పథకం వర్తించనివారు కార్యాలయానికి వస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే సమస్యను పరిష్కరించి అర్హులకు లబ్ధి చేకూరేలా చూస్తాం.

– రమేశ్‌బాబు, విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్, కామారెడ్డి

అధ్యయనంతో శిఖరాగ్రాలకు చేరవచ్చు

- కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన రమేశ్ కార్తిక్ నాయక్



మంచి కవిత్వం కార్యక్రమంలో పాల్గొన్న కవులు రమేశ్ కార్తిక్ నాయక్, ఘనపురం దేవేందర్

నిజామాబాద్‌అర్బన్: కవిత్వం పాఠకుల హృదయాల్లో ఆర్ద్రత నింపుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన రమేశ్ కార్తిక్ నాయక్ అన్నారు. కవిత్వం రాయాలంటే నిరంతర అధ్యయనం చేయాలని.. అప్పుడే శిఖరాగ్రాలకు చేరవచ్చని పేర్కొన్నారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'మంచి కవిత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ కార్తిక్ నాయక్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన ద్వారా జిల్లాకు సాహిత్య రంగంలో విశిష్టమైన స్థానం దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యువతరం సాహిత్యం వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రముఖ కవి బీఎస్‌టీ మాట్లాడుతూ సామాన్య ప్రజల భాషలోనే కవిత్వ భాష దాగి ఉంటుందన్నారు. దానిని మనం అన్వేషించగలిగితే చక్కని సాహిత్యాన్ని సృష్టించగలమని పేర్కొన్నారు. హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ మన జిల్లాకు తొలిసారిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం 26 ఏళ్ల వయసులోనే అత్యంత పిన్న వయస్కుడిగా ఆ పురస్కారాన్ని అందుకోవడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ రమేశ్ కార్తిక్ నాయక్ స్ఫూర్తి ఈనాటి యువతరంపై తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి తిరుమల శ్రీనివాస్ ఆర్య, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, విట్టం ధనుంజయ్, భట్టు శ్రీధర్, పద్మజా రెడ్డి, కామినేని రేణుక, సిరిప లింగం, మల్లవరపు చిన్నయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టరేట్ సాధించిన గంట్యాల ప్రసాద్, సాహిత్య అవార్డులు అందుకున్న ఆరుట్ల శ్రీదేవి, కళా గోపాల్, వసంత లక్ష్మణ్‌లను సత్కరించారు. అలాగే ఈరోజు దివంగత మాజీ ప్రధాని, సాహితీవేత్త పీవీ నర్సింహారావు జయంతిని నిర్వహించారు.

అంకిత భావంతో పనిచేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- పదవీ విరమణ పొందిన అధికారులకు సన్మానం

కామారెడ్డి క్రైం: ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పదవీ విరమణ పొందిన డీపీఆర్వో శాంతి కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సింహారావులను శుక్రవారం జిల్లా అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారాం, ప్రతినిధులు దయానంద్, సతీష్ కుమార్, భాగ్యలక్ష్మి, రమ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సాయిలు, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డీపీఆర్వో శాంతి కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

క్లుప్తంగా

గాయత్రి షుగర్స్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ అంతటి రాజు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తలసరి విద్యుత్ వినియోగం బాగా పెరిగిందన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్స్, చార్జింగ్ స్టేషన్లు, మొదలైన విస్తృత అనువర్తనాలలోమ విద్యుత్‌ను వినియోగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జీఎం ఇంజనీరింగ్ వీర్రారాజు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తడివాగు పరిశీలన



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీ మత్తడి వాగును శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పరిశీలించారు. మత్తడి నుంచి వస్తున్న మురుగు నీరు వల్ల స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు రావడంతో వాగును శుభ్రం చేయించారు. అక్కడి నుంచి 18వ వార్డులో భవాని నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్ మిర్జాఅఫీజ్, నాయకులు పంపరి శ్రీను, ప్రసాద్ ఉన్నారు.

‘రైతు బంధు’ అమలుపై సొసైటీ సమావేశం

కామారెడ్డి అర్బన్ : రైతు బంధు పథకం అమలుపై ఈనెల 29న శనివారం ఉదయం 10గంటలకు అభిప్రాయాలు తెలుసుకోవడానికి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు పాత లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించాలి



కామారెడ్డి టౌన్ : విధి నిర్వహణలో ప్రతీ ఒక్క ఉద్యోగి ఉత్తమ సేవలను అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వ్యాక్సిన్ స్టోర్‌లో సీహెచ్‌వోగా విధులు నిర్వహించి పదవి విమరణ పొందిన రమేశ్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిల్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం కార్యవర్గం ఎన్నిక

ఖలీల్‌వాడి: ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాలతోపాటు సిద్దిపేట జిల్లాను కలుపుకొని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం కార్యవర్గం ఎన్నుకున్నట్లు ఫోరం అధ్యక్షుడు ఫణి శుక్రవారం తెలిపారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని ఆయా రైల్వే మార్గాల్లో నూతన రైళ్ల ప్రతిపాదనలు, స్టేషన్లలో నెలకొన్న సమస్యలు, రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జిల నిర్మాణం, ప్రయాణీకుల రద్దీని బట్టి రైళ్ల సంఖ్యను పెంచేలా అధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడానికి ఈ ఫోరం ఏర్పాటు అయినట్లు చెప్పారు. అధ్యక్షుడిగా ఫణి, జనరల్ సెక్రెటరీగా శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీగా సిరిపురం సాయికృష్ణ, ట్రెజరీగా మోహన్ గంగుల తదితరులు ఎన్నికయ్యారు.

ఏసీబీ నజర్!

- అవినీతి అధికారులపై దాడులు
- చేయి తడిపితే కానీ పలు శాఖల్లో పనులు కాని పరిస్థితి
- అప్రమత్తం అవుతున్న అధికారులు



నిజామాబాద్‌లోని ఏసీబీ కార్యాలయం



ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లాపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించారు. అవినీతికి అండగా నిలిచే ప్రధాన శాఖలపై ఫోకస్ పెట్టారు. జనవరి నుంచి జూలై వరకు నాలుగు చోట్ల దాడులు నిర్వహించి, ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. గతంలో ఏసీబీ అధికారులు రెవెన్యూ, పోలీసు శాఖ, మున్సిపల్ శాఖలకు పరిమతం కాగా ఇప్పుడు అన్ని శాఖల్లో జరుగుతున్న అవినీతిపై కన్నేశారు. ప్రస్తుతం అవినీతి తిమింగలాలు అన్ని శాఖలలో విస్తరించారు. చేతులు తడపనిదే పనులు కావడం లేదు. దీంతో అధికారుల తీరుతో విసిగి వేసారేసిన బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.

ఆదాయానికి మించిన ఆస్తులపై దృష్టి

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న అధికారులపై ఏసీబీ దృష్టి సారించింది. సదరు ఉద్యోగి కుటుంబ సభ్యుల నుంచి ఆదాయ వివరాలను తెలుసుకొని వాటి తర్వాత ఉద్యోగికి వచ్చిన నెలసరి వేతనం వివరాలను పక్కాగా పరిశీలించిన తర్వాత అధికారులపై చర్యలు తీసుకుంటారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయితీరాజ్, నీటిపారుదల, మున్సిపల్, రవాణా, రిజిస్ట్రేషన్, విద్యుత్ శాఖలలో అవినీతి ఆరోపణలు తరుచు వినిపిస్తుంటాయి. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న అధికారుల వివరాలు ఏసీబీ అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం.

పైసలు ఇస్తేనే పని

ఒక వైపు ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్న అధికారులు అవినీతిని మాత్రం వదలడం లేదు. చేతులు తడిపితేనే పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పౌరసరఫరా శాఖలో ప్రతి దానికి ఓ రేట్ నిర్ణయించి కేటాయింపులు చేస్తారనే ప్రచారం ఉంది. ఇటీవల ఈ శాఖకు చెందిన ఇద్దరు అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా డబ్బులు ఇవ్వని వారిని అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో పనుల కోసం వచ్చిన వారు ఎంతో కొంత ముట్టచెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఏసీబీ అధికారుల వివరాలు

టోల్ ఫ్రీ నంబర్	1064
శేఖర్‌గౌడ్, ఏసీబీ డీఎస్పీ, ఉమ్మడి నిజామాబాద్	9154388950
నగేశ్, ఏసీబీ సీఐ, నిజామాబాద్	9154388951
శ్రీనివాస్, ఏసీబీ ఎస్సై, కామారెడ్డి	9154388953

ఆరు నెలల్లో నాలుగు చోట్ల దాడులు

- నగరంలోని నార్త్ తహసీల్దార్ కార్యాలయంలో ఓ రైతు వ్యవసాయ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఆర్ఐని ఆశ్రయించారు. దీనికి ఆర్ఐ డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీకి సమాచారం అందజేశాడు. రూ.25 వేలు ఇస్తున్న సమయంలో వీఆర్ఏ తోపాటు ఆర్ఐ రాజును ఏసీబీ అధికారులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు.
- జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండలో ఓ ఇంటి రిజిస్ట్రేషన్ కోసం పంచాయితీ కార్యదర్శిని బాధితుడు ఆశ్రయించగా డబ్బులు డిమాండ్ చేశాడు. బాధితుడు ఏసీబీ వద్దకు వెళ్లగా, డబ్బులు తీసుకుంటుండగా అధికారులు కార్యదర్శిని పట్టుకున్నారు.
- కమ్మర్‌పల్లి మండలంలోని ఓ అధికారి సర్వీస్ బుక్‌లో సెలవులను పాత తేదీలో రాయడానికి సీనియర్ అసిస్టెంట్, ఎంపీడీవో డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో ఏసీబీని ఆశ్రయించారు. రూ.10 వేలు ఇస్తున్న సమయంలో సీనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఎంపీడీవోను భిక్కనూర్‌లో అదుపులోకి తీసుకున్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ అధికారులు చెక్‌పోస్టులలో తనిఖీలు చేయగా సాలూరా మండలంలోని చెక్ పోస్టులో లెక్క చూపని రూ.12 వేలు లభించాయి. దీనిపై కేసు నమోదు చేశారు.

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలి

పనుల కోసం అధికారులు లంచం అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేయాలి. టోల్ ఫ్రీ నెంబర్ 1064కు సమాచారం ఇచ్చిన సరిపోతుంది. లేకుంటే నేరుగా ఏసీబీ కార్యాలయానికి రావచ్చు.

– శేఖర్‌గౌడ్, ఏసీబీ డీఎస్పీ, నిజామాబాద్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

కామారెడ్డి టౌన్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. గేటు ముందు బైటాయించి గంటపాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజుల వసూళ్లు, స్కూల్‌లోనే బుక్స్, టై, బెల్టులు, షూ, బ్యాగులు తదితర సామాగ్రి విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలలో 25శాతం పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించాలన్నారు. ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు ప్రత్యూష, నాయకులు వరుణ్, వెంకటేష్, మానస తదితరులున్నారు.

విద్యార్థి సంఘాల నిరసన



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు నోటికి రిబ్బన్ కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే విద్యార్థులను, యువకులను నిర్బంధిస్తూ లాఠీ చార్జీలు చేయిస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాలను లీక్ వ్యవహారంలో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారని విమర్శించారు.

నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి కారకులైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్ కుమార్, ముదాం అరుణ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం.విఠల్ తదితరులున్నారు.

‘ప్రైవేట్’ దోపిడీని అరికట్టాలి..

నిజామాబాద్‌అర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. డీఈవో కార్యలయం ముందు నిరసనకు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం డీఈవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, విభాగ్ కన్వీనర్ బచ్చన బోయిన శివకుమార్, కైరి శశి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీ పెరిగిపోయిందన్నారు. జీవో నెంబర్–1 ప్రకారం పాఠశాలలో పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, అమ్మవద్దని ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ విద్యాధికారులు నిద్రమత్తులో ఉండి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దామ సునీల్, సాయికుమార్ అమతచారి, ప్రవీణ్ నాగరాజ్, సమీర్ పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ




మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: రైతు రుణాలను ఆగస్టు 15లోపు ప్రభుత్వం మాఫీ చేస్తుందని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. శుక్రవారం ఆయన కమ్మర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రభుత్వం నాలుగు గ్యారంటీలను అమలు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ రుణమాఫీ చేయడం లేదని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

మోదీ ఇంటి ఎదుట దీక్ష చేయాలి

కాంగ్రెస్ హామీలను నెరవేర్చకుంటే దీక్ష చేస్తానన్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మొదట ప్రధాని మోదీ ఇంటి ఎదుట దీక్షకు దిగాలని మోహన్‌రెడ్డి సూచించారు. గుజరాత్‌కు మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రానికి కావలసిన నిధులను ఇవ్వాలని మోదీ ఇంటి ఎదుట దీక్ష చేయాలని హితవు పలికారు. సుంకెట రవి, వేణురాజ్, తిప్పిరెడ్డి భాస్కర్, చిన్నోళ్ల రెడ్డి, అజ్మత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శివుడికి నాగాభరణం



నిజామాబాద్‌అర్బన్: నాగారంలోని నందిగుట్ట శివాలయంలో శుక్రవారం శివలింగంపైన నాగుపాము ప్రత్యక్షమైంది. ఉదయం పూజారి గుడి తలుపులు తెరిచి లోపలికి వెళ్లగా శివలింగంపైన పడగవిప్పిన నాగుపాము కనిపించింది. రాత్రంతా శివలింగంపైనే పాము ఉన్నట్లు పూజారి పేర్కొన్నారు. స్థానికులు ఈ విషయం తెలుసుకొని చూడటానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గేదెపై సవారీ



రెంజల్ మండలం కందకుర్తి రోడ్డులో నీల గ్రామం వద్ద ఓ వ్యక్తి గేదెపై కూర్చొని సవారి చేశాడు. ఆ మార్గంలో వెళ్లేవారు ఆయనను ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

పీవీ సేవలు మరువలేనివి



పీవీ విగ్రహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సుభాష్‌నగర్: ప్రధానిగా పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం పీవీ జయంతి సందర్భంగా నగర శివారులోని బోర్గాం(పి) చౌరస్తాలోగల పీవీ విగ్రహానికి బాజిరెడ్డి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. నుడా మాజీ చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్, రోటే సురేష్ శర్మ, పుల్కల్ రమేష్, అప్పల కిష్టయ్య, పురుషోత్తం పట్వారీ, లక్ష్మీనారాయణ భరద్వాజ్, శ్రీనాథ్, మల్లికార్జున్‌రావు, చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

జీజీహెచ్ ఎదుట బోధనా వైద్యుల నిరసన



నిజామాబాద్‌నాగారం: నల్గొండ జిల్లా ఆస్పత్రిలో పరిశీలన చేయడానికి జిల్లాస్థాయి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడంపై శుక్రవారం నగరంలోని జీజీహెచ్ ఎదుట తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్‌మాదాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇతర శాఖల అధికారులకు తనిఖీ చేసే అధికారం లేదన్నారు. అలాగే టీచింగ్ డాక్టర్లకు బదిలీలు చేపట్టాలన్నారు. బోధనా వైద్యులకు సరైన వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు గోపాల్‌సింగ్, దినేశ్, మురళి, సుభాష్, రాజేందర్, హరీశ్‌స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడు ఇసుక టిప్పర్ల పట్టివేత

రెంజల్: రెంజల్ మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బోధన్ మండలం పెగడాపల్లి నుంచి నిర్మల్, నిజామాబాద్‌లకు శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రెంజల్ కమాన్ వద్ద సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దొరికిన ఇసుక టిప్పర్లను తహసీల్దార్‌కు సరేండర్ చేశామని చెప్పారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఒక్కో టిప్పర్‌కు రూ.10 వేల జరిమానా విధించి టిప్పర్లలోని ఇసుకను ప్రభుత్వ అవసరాలకు తరలించారు.

గోపన్‌పల్లి చౌరస్తాలో ఏడు ట్రాక్టర్లు..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని ఖద్గాం, పుల్కల్ మంజీర నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదు మేరకు పోలీసులు గోపన్‌పల్లి చౌరస్తాలో ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలించకుండా రెవెన్యూ అధికారులు మంజీర వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి గ్రామ సేవకులను నియమించారు. ట్రాక్టర్లను గ్రామ సేవకులు అడ్డుకుంటే ఓ రెవెన్యూ అధికారి గ్రామ సేవకులకు ఫోన్ చేసి వదిలివేయాలని చెప్పాడు. దీంతో గ్రామస్తులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గోపన్‌పల్లి చౌరస్తాలో పట్టుకున్నారు.

ఎడపల్లి: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్‌లను సాటాపూర్ గేట్ శుక్రవారం పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

నగరంలో దుకాణాల తనిఖీ

నిజామాబాద్‌నాగారం: నగరలోని జోన్–1(నాందేవాడ) ప్రాంతంలో పలు హోటళ్లు, దుకాణాలను శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్ తనిఖీ చేశారు. వంటశాలలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన భోజనాన్ని మాత్రమే విక్రయించాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

బోధన్‌రూరల్: మద్యానికి బానిసై, భార్య పిల్లలు తనతో లేరనే మనోవేదనతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ కథనం ప్రకారం.. మండలంలోని పెంటాకాలన్ గ్రామానికి చెందిన జి లక్ష్మణ్(28) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం నుంచి మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండటంతో ఆమె వేరుగా ఉంటుంది. దీంతో లక్ష్మణ్ గ్రామంలో కొంత కాలంగా ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై శుక్రవారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

మతిస్థిమితం సరిగ్గా లేని యువకుడు..

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి తండాకు చెందిన మేగావత్ ప్రకాశ్(21) మతి స్థిమితం సరిగ్గా లేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. మతిస్థిమితం లేకుండా తిరిగే ప్రకాశ్ ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తండా శివారులోని గుట్టపై చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లు పశువుల కాపర్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉరి వేసుకున్న వ్యక్తిని ప్రకాశ్‌గా గుర్తించారు. మృతుడి తండ్రి లింబానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రాజంపేటలో..

రాజంపేట: మతిస్థిమితం బాగాలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేటలో చోటుచేసుకుంది. ఎస్సై సంపత్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జోగిపేట రంజిత్(25)కు కొంతకాలంగా మతిస్థిమితం బాగా లేదు. ఇంటి వద్దే ఏమి పనిచేయకుండా ఖాళీగా ఉంటూ తరచూ తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. 15 రోజుల క్రితం తల్లిదండ్రులతో గొడవ పడి వారిని ఇంటి నుంచి బయటకు పంపాడు. దీంతో వారు వేరే ఇంట్లో కిరాయి ఉంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రంజిత్ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.



రంజిత్(ఫైల్)

అప్పల బాధతో రైతు..



రవి(ఫైల్)

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన బొజ్జ రవి(38) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. రవి తనకున్న ఎకరంలో వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నాడు. భూమిలో నీటి సౌకర్యం కోసం ఐదు బోర్లు వేయించినా నీళ్లు పడలేదు. బోర్లు వేయించడం కోసం అప్పులు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పుల బాధ భరించలేక ఈ నెల 25న రాత్రి పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 26న మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య లత, ఒక కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

మరణంలోనూ వీడని అనుబంధం

- గుండెపోటుతో అక్కాతమ్ముడి మృతి





విజయలక్ష్మి,రామానుజస్వామి (ఫైల్)

సుభాష్‌నగర్: అక్కాతమ్ముడి అనుబంధం మరణంలోనూ వీడలేదు. 24 గంటల వ్యవధిలో గుండెపోటుతో వారిద్దరు మృత్యు ఒడికి చేరారు. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి (69) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందింది. అక్క మరణాన్ని తట్టుకోలేని రామానుజస్వామి(59) గురువారం సాయంత్రం గుండెపోటుతో మరణించాడు. విజయలక్ష్మి అంత్యక్రియలు పూర్తి చేసుకుని ఆమె ఇంట్లోనే ఆయన సేద తీరుతున్న సమయంలో గుండెపోటు వచ్చింది. ఒక్కరోజు వ్యవధిలో ఇరువురు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

యువతి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్న సదరు యువతి శుక్రవారం ఉదయం లేచేసరికి కనిపించలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆరు బైక్‌లు సీజ్

మోపాల్: మండలంలో శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా నంబర్ ప్లేట్ లేని ఆరు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. అదేవిధంగా మరో 50 మంది వాహనదారులకు ఎంవీఐ యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించామన్నారు. మరో వాహనదారుడిపై డ్రంకన్ డ్రైవ్ కింద కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. వాహనదారులు తప్పకుండా ధృవపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ఇల్లు దగ్ధం



వర్ని: మండలంలోని గుంటూరు క్యాంప్‌లో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కుర్మె వెంకట్ ఇంట్లో ఎవరు లేని సమయంలో మంటలు చెలరేగి దగ్ధమైంది. ప్రమాదంలో రూ.50 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనం, సరుకులు కాలి పోయాయని బాధితుడు తెలిపారు.